క్లుప్తంగా

హైస్కూలు విద్యార్థుల క్షేత్ర సందర్శన



తెనాలిరూరల్: క్షేత్ర సందర్శనలో భాగంగా అంగలకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీలో గల టెక్స్‌టైల్స్ విభాగంలోని హ్యాండ్లూమ్స్, కుట్టుమిషన్లు, డైయింగ్ మిషన్ల పని తీరును మంగళవారం పరిశీలించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్. అనురాధ పర్యవేక్షణలో లెర్నెట్‌స్కిల్స్ సంస్థ సహకారంతో విద్యార్థులను యూనివర్సిటీకి తీసుకెళ్లారు. యూనివర్సిటీలో టెక్స్‌టైల్ విభాగం హెచ్‌వోడీ సీహెచ్. గోవర్ధన్ రావు, ఎం. శివ జగదీష్‌కుమార్ టెక్స్‌టైల్ రంగానికి సంబంధించి విద్యార్థులకు పలు వివరాలను తెలిపారు. ఉపాధ్యాయులు కె. సీతారామమూర్తి, ఎస్‌కే మాలి, కె. యోహాన్, వి. విద్యాసాగర్, కె. శ్రీలత, వృత్తి విద్యా శిక్షకులు టి. వెంకటేశ్వరమ్మ, ఇ. అమర్‌నాథ్ విద్యార్థులతో ఉన్నారు. ప్రధానోపాధ్యాయురాలు ఎస్. అనురాధ పర్యవేక్షించారు.

యువ కళాకారులకు శిక్షకుడిగా పాతూరి



తెనాలి: విజయవాడలో ఈనెల 28, 29 తేదీల్లో జరగనున్న 6వ ప్రపంచ తెలుగు రచయితల మహా సభలకు పట్టణానికి చెందిన రంగస్థల నటుడు, రచయిత, దర్శకుడు డాక్టర్ పాతూరి సుబ్రహ్మణ్య కవికి ఆహ్వానం అందించింది. 28వ తేదీన సాంస్కృతిక ప్రతినిధుల సదస్సులో పాతూరి పాల్గొంటారు. యువకళాకారులకు నాటక, సాహిత్య ప్రక్రియల శిక్షకునిగా వ్యవహరిస్తారు. తెలుగు సాహిత్య అవధాన పౌరాణిక నాటక రంగాల్లో మూడున్నర దశాబ్దాలుగా వీరు ప్రముఖులు.

ఆదర్శ కళామూర్తి రావినూతల శ్రీరామమూర్తి

ప్రథమ వర్ధంతి సభలో వక్తల నివాళి



తెనాలి: ప్రముఖ రచయిత, నటుడు, దర్శకుడు రావినూతల శ్రీరామమూర్తి ప్రథమ వర్ధంతి సందర్భంగా సంస్మరణసభను మంగళవారం సాయంత్రం స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో నిర్వహించారు. అభ్యుదయ కళా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటైన సభకు రచయిత, గాయకుడు పొన్నపల్లి గోపాలకృష్ణమూర్తి అధ్యక్షత వహించారు. కార్యనిర్వాహక కార్యదర్శి బెల్లకొండ వెంకట్ తన ప్రసంగంలో శ్రీరామమూర్తి జీవిత విశేషాలను వివరించారు. సాహిత్య, సాంస్కృతిక రంగాలకు సంపూర్ణత్వం ఆపాదించిననాడు ఆ కళలు వెలుగొందుతాయని నమ్మి ఆ బాటలో పయనించిన ఆదర్శ కళామూర్తి శ్రీరామమూర్తి అని గోపాలకృష్ణమూర్తి అన్నారు. పట్టణ రంగస్థల కళాకారుల సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి గరికపాటి సుబ్బారావు తన ప్రసంగంలో శ్రీరామమూర్తి కళాకారుల సమస్యల పరిష్కారానికి కృషిచేశారని చెప్పారు. నంది నాటకోత్సవాల్లో తెనాలికి ప్రప్రథమ నందిని తీసుకొచ్చిన ఘనత ఆయనకు దక్కుతుందన్నారు. కవయిత్రి అస్మతున్నీసా మాట్లాడుతూ పాటలు, మాటల రచనలో శ్రీరామమూర్తి ఉద్దండుడన్నారు. సినీరంగంలోనూ ఆయనకు ప్రవేశం ఉందని గుర్తుచేశారు. తొలుత శ్రీరామమూర్తి చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన రాసిన పాటలను అలపర్తి వెంకటేశ్వరరావు, వెలగా సుభాష్ చంద్రబోస్, దినేష్, బెల్లంకొండ వెంకట్, త్రివేణి, అపర్ణ, శిరీష, లీలావతి, శుశ్రుత, హరిత గానం చేశారు. ఎంవీ రఘునాధరావు, బొల్లిముంత కృష్ణ, దేవిశెట్టి కృష్ణారావు, శ్రీరామమూర్తి కుటుంబసభ్యులు రావినూతల ప్రకాష్, లక్ష్మీ అన్నపూర్ణ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఏర్పరుచుకోవాలి



భట్టిప్రోలు: విద్యార్థులు చట్టాలపై అవగాహన ఏర్పరుచుకోవాలని భట్టిప్రోలు టీఎంరావు హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు చందలూరి రామకోటేశ్వరరావు పేర్కొన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం స్థానిక హైస్కూల్‌లో విద్యార్థులకు వినియోగదారుల హక్కు, రక్షణ చట్టం ఆవశ్యకతను తెలియ చేసి ప్రతిజ్ఞ చేయించారు. రామ కోటేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో 1986లో వినియోగదారుల చట్టం అమలులోకి వచ్చిందని 2020లో కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టాన్ని తీసుకు వచ్చిందని తెలిపారు. న్యాయవాదుల అవసరం లేకుండా నేరుగా వినియోగదారుడు తాను ఉన్న ప్రాంతం నుంచే ఫిర్యాదు చేయవచ్చునని .....ఇందు కోసం జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో కన్స్యూమర్ ప్రొటెక్షన్ కమిషన్లు పని చేస్తున్నాయని చెప్పారు. నేషనల్ కన్స్యూమర్ హెల్ప్ లైన్ (ఎన్‌సీహెచ్) యాప్‌లో కూడా బాధితులు ఫిర్యాదు చేయవచ్చునని పేర్కొన్నారు. 1915, 1800 114 000 టోల్ ఫ్రీ నంబర్లకు కాల్ చేసి సమస్య చెబితే జిల్లా స్థాయి కమిషన్‌కు తెలియజేస్తారన్నారు.

పశువులకు ప్రమాదం గొంతువాపు వ్యాధి



పశువైద్యాధికారి సాయిసతీష్‌రాజు



మేత మేస్తున్న గేదెలు

కొల్లిపర: ప్రస్తుత సీజన్‌లో పశువులకు గొంతు వాపు వ్యాధి పొంచి ఉంది. ప్రస్తుతం వాతావరణంలో మార్పులు వలన తేలిక పాటి వర్షాలు పడుతున్నాయి. దీనికి తోడు మరో ప్రక్కన చలి పెరిగింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని పశువుల యజమానులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కొల్లిపర మండల పశువైద్యాధికారి సాయిసతీష్‌రాజు సూచిస్తున్నారు. వ్యాధి లక్షణాలు జాగ్రత్తలు నివారణ చర్యలు ఆయన సాక్షి కి వివరించారు.

వ్యాధి వ్యాప్తి ఇలా..

గొంతు వాపు వ్యాధి ముఖ్యంగా గేదెలు, దున్నల్లో కనిపిస్తుంది. ఆవులు, ఆవుదూడల్లో కాస్త తక్కువగా ఉంటుంది. వాతావరణంలో ఉష్ణోగ్రత తగ్గినప్పుడు, వర్షంలో ఎక్కువగా తడిసినప్పుడు అటు ఎండుగడ్డి ఇటు పచ్చిగడ్డి మేసిన పశువులకు ఈ వ్యాధి సోకే అవకాశం ఉంది. ఇలాంటి సమయాల్లో వ్యాధికారక సూక్ష్మజీవులు అభివృద్ధి చెంది పశువులు ప్రమాదాలకు గురవుతాయి. అలాంటి పశువులు మేత తినవు, నీరసించి అలసటగా కనిపిస్తాయి. అలాంటి పశువుల వద్ద ఉన్న ఇతర పశువులకు వ్యాధి సోకుతుంది.

లక్షణాలివి...

గొంతు వాపు వ్యాధి సోకిన పశువుల్లో దవడల మధ్య గొంతు పై భాగాన, మెడకింద వాపు వస్తుంది. ఈ వాపులో రక్తం కనిపిస్తుంది. కళ్లు ఎర్రగా తయారై నీరుగారుతుంటాయి. పశువులు,ఆయాసంతో శ్వాసపీలుస్తూ శబ్దం చేస్తుంటాయి. తీవ్ర జ్వరానికి గురవుతాయి. పశువులు మేత సరిగా తినక పోయినా అలసటగా కనిపించి నాలుక బయటకు పెడతాయి. అలాంటి పశువులు 24 గంటల్లోపు చనిపోయే అవకాశం ఉంది.

చికిత్స ఇలా..

- వ్యాధి లక్షణాలు కనిపించిన పశువులను దగ్గరల్లో ఉన్న పశువైద్య కేంద్రాలకు తీసుకెళ్లాలి.
- యాంటిబయాటిక్ మందులు వేయించాలి.
- వ్యాధి సోకిన పశువులు, గేదెలను మిగతా వాటిలో కలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- వెద్యుల సూచనల మేరకు తరచుగా పాకల్లో వ్యాధికి సంబంధించిన రసాయనిక, క్రిమిసంహారక మందులను చల్లుతుండాలి.
- వ్యాధి సోకిన పశువులు తినగా మిగిలిన గడ్డిని కాల్చివేయాలి
- మల, మూత్రాలను గుంతలో పూడ్చిపెట్టాలి.
- ఒక వేళ వ్యాధి తీవ్రత ఎక్కువై పశువులు చనిపోతే వాటి కళేబరాలను లోతుగా గుంత తీసి పాతిపెట్టాలి.
- ముందు జాగ్రతల్లో భాగంగా టీకాలు అన్ని పశువులకు వేయించాలి.

27న విద్యుత్ చార్జీల పెంపుపై 'పోరుబాట'

మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

తెనాలి: కరెంటు చార్జీలు పెంచబోమనీ, అవసరమైతే తగ్గిస్తామని ఎన్నికల్లో ఊరూవాడా చాటిన కూటమి పార్టీల నేతలు, అధికారంలోకి వచ్చాక ఛార్జీలను తగ్గించటం అటుంచి ఏకంగా రూ.15,485 కోట్ల భారాన్ని రాష్ట్రప్రజలపై మోపుతున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ విమర్శించారు. పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు ప్రకారం, కరెంటు ఛార్జీల పెంపుతో ప్రజలపై భారాన్ని మోపినందుకు నిరసన వ్యక్తంచేస్తూ ఈనెల 27న చెంచుపేటలోని విద్యుత్ డివిజన్ కార్యాలయం ఎదుట ప్రదర్శన చేసి, ఛార్జీలను తగ్గించాలనే డిమాండ్‌తో వినతిపత్రం అందిస్తామని తెలిపారు. ఈ ఆందోళనలో నియోజకవర్గ ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు. స్థానిక గంగానమ్మపేటలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో శివకుమార్ మాట్లాడారు. కరెంటు ఛార్జీల కింద 6,090 కోట్ల వసూళ్లకు గత నెలలో కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, జనవరిలో మరో రూ.9,412 కోట్ల వసూళ్లకు పూనుకుంటుందని చెప్పారు. మొత్తం 15,485 కోట్లను ట్రూఅప్ ఛార్జీలు, సర్దుబాటు ఛార్జీల పేరుతో నెలనెలా ప్రజలనుండి వసూలు చేస్తారని వివరించారు. ఇప్పటికే కరెంటు బిల్లులు పెరిగాయనీ, జనవరి నుండి మోత మోగుతాయని వ్యాఖ్యానించారు. అంతేకాకుండా ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను రద్దుచేశారని చెప్పారు. ఎన్నికలముందు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చటం లేదని గుర్తు చేశారు. ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే అందరికీ అమ్మ ఒడి ఇస్తామని చెప్పి, ఇప్పుడు ఒక్కరికి కూడా ఇవ్వటం లేదన్నారు. రైతుభరోసాను రూ.20 వేలకు పెంచుతామని హామీనిచ్చి, ఇప్పుడు రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. ధాన్యం కొనుగోళ్లలోనూ ప్రభుత్వం విఫలమైందన్నారు. పార్టీ నాయకులు దేసు శ్రీనివాసరావు, పెదలంక వెంకటేశ్వర్లు, తాడిబోయిన రమేష్, కఠారి హరీష్, తోట రఘురాం, యలవర్తి సాంబశివరావు, మల్లెబోయిన రాము, కోలా వాసు, పెచ్చెట్టి సుభాని, కావటి నిర్మల, అక్కిదాసు కిరణ్, షేక్ బాషా, ఎస్.రాజీవ్, నాగసరపు కృష్ణ పాల్గొన్నారు.

వేంకటేశ్వరుని పారాయణం

అద్దేపల్లి(భట్టిప్రోలు): అద్దేపల్లికి చెందిన బొలిశెట్టి సునీల్‌కుమార్ వేంకటేశ్వర స్వామి దీక్ష తీసుకున్న సందర్భంగా మంగళవారం స్వామి గానామృత పారాయణం నిర్వహించారు. గోవింద నామాలతో అర్ధకాహం జరిగింది. టీటీడీ ధర్మాచారి, శుక్రవారోత్సవ ప్రధాన కార్యదర్శి బూర్లె అరుణ కుమారి ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. శుక్రవారోత్సవ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

డాక్టర్ వుళ్లక్కికి ఘన నివాళి



డాక్టర్ వుళ్లక్కి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వైద్యులు

తెనాలి రూరల్: పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు, మేజర్ కాకుమాను వుళ్ళక్కి వర్ధంతిని తెనాలి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) తెనాలి శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. బోసురోడ్డులోని ఐఎంఏ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, పేద ప్రజలకు పండ్లు, ఫలహారం అందజేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ తన పార్థివ దేహాన్ని గుంటూరు వైద్య కళాశాల అనాటమీ ల్యాబ్‌కు వైద్య విద్యార్థులకు శిక్షణ పొందేందుకు ఉపయోగపడే విధంగా ఇచ్చారని, అలాగే తన స్థిరాసుల్లో కొంత భాగమైన తెనాలి బోస్‌రోడ్డులోని నివాసాన్ని తెనాలిలోని వైద్యులు నిరంతరం వైద్య విద్య నేర్చుకునేందుకు ఉపయోగపడే విధంగా ఐఎంఏకు రాసిచ్చారని తెలిపారు. రెండో ప్రపంచ యుద్ధంలో సైనికులకు వైద్య సేవలు అందించి, యుద్ధం అనంతరం తెనాలిలో వైద్యసేవలు అందించి సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ఐఎంఏ తెనాలి శాఖ అధ్యక్షుడు డాక్టర్ కావూరు అనిల్ కుమార్, కార్యదర్శి డాక్టర్ జి.మధు ప్రభాకర్ బాబు, ఉపాధ్యక్షురాలు డాక్టర్ పావని, కోశాధికారి డాక్టర్ కె. శ్యాంప్రసాద్ పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ చందు సాంబశివుడు, డాక్టర్ వేమూరు శేషగిరిరావు, డాక్టర్ ఉమామహేశ్వరరావు, డాక్టర్ గంటా నరసింహారావు, డాక్టర్ గుమ్మడి సాంబశివరావు, డాక్టర్ జె. కోటి నాగయ్య డాక్టర్ విశ్వమోహన్‌రావు, డాక్టర్ ఎంవీ సత్యనారాయణ, డాక్టర్ జె. వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీల పెంపుదలకు వ్యతిరేకంగా పోరాడాలి

సీపీఎం సీనియర్ నేత ములకా శివసాంబిరెడ్డి



విద్యుత్ బిల్లును పరిశీలిస్తున్న సీపీఎం నేతలు

తెనాలి: విద్యుత్ చార్జీల పెంపుదల, స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా వినియోగదారులు, రైతులు పోరాడాలని సీపీఎం పార్టీ సీనియర్ నాయకుడు ములకా శివసాంబిరెడ్డి కోరారు. రూరల్ గ్రామం కంచర్లపాలెంలో మంగళవారం సీపీఎం నాయకులు విద్యుత్ బిల్లులను పరిశీలించారు. చుక్కపల్లి భాస్కరరావుకు విద్యుత్ వినియోగం 76 యూనిట్లకు రూ.196 బిల్లు కాగా, ట్రూఅప్, వగైరా చార్జీలతో రూ.439 బిల్లు వచ్చిందని తెలుసుకున్నారు. రూ.200 బిల్లుపై రూ.200 పైగా భారం మోపటం దారుణమన్నారు. విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా పోరాడాలని కోరారు. పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ చుక్కపల్లి ప్రభాకరరావు మాట్లాడుతూ ముందుగా షాపులకు, కొద్దిరోజుల్లో ఇళ్లకు తరువాత వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ విద్యుత్ మీటర్లు బిగించే ప్రమాదాన్ని తక్కువ చేసి చూడొద్దని కోరారు. అనంతరం విద్యుత్ బిల్లులను తగులబెట్టారు. కాసాని నరసయ్య, చుక్కపల్లి లక్ష్మీనారాయణ, ఎర్రగుంట దేవసహాయం, వానగుంట్ల యలమంద నన్నే పాముల చిన్నబ్బాయి, గాలి కోటేశ్వరరావు, కొంగర సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

మానవ హృదయాలను క్రీస్తుకు సమర్పించడమే క్రిస్మస్

- తెనాలి పట్టణంలో క్రిస్మస్ వేడుకలకు చర్చిలు ముస్తాబు
- బుధవారం తెల్లవారుజాము నుంచే ప్రార్థనలు ప్రారంభం



దేదీప్యమానంగా వెలుగొందుతున్న ఆర్‌సీఎం చర్చి



తెనాలిలో కేక్ కట్ చేస్తున్న అతిథులు



పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న రాజేశ్వరరావు



కేక్ కట్ చేస్తున్న లెఫ్టినెంట్ కల్నల్ థామస్, సీయోను

తెనాలిఅర్బన్: మానవ హృదయాలను క్రీస్తుకు సమర్పించడమే నిజమైన క్రిస్మస్. ఇలాంటి క్రిస్మస్‌ను ప్రపంచ వ్యాప్తంగా సంతోషంతో జరుపుకుంటూ ఉంటారు. శాంతికి, త్యాగానికి మారుపేరుగా ఏసుక్రీస్తును అభివర్ణిస్తుంటారు. అలాంటి ఏసుక్రీస్తు జన్మదినాన్ని క్రిస్మస్ పండుగగా జరుపుకుంటూ ఆయనను ఆరాధించడం జరుగుతుంది.

అందంగా అలంకరించిన చర్చిలు

బుధవారం క్రిస్మస్ పర్వదినం కావడంతో తెనాలి పట్టణంలోని అన్ని చర్చిలు వేడుకలకు ముస్తాబ్ అయ్యాయి. పట్టణంలోని టౌన్‌చర్చి, బాప్టిస్ట్ చర్చిలు, లూథరన్‌చర్చిలు, సాల్వేషన్ ఆర్మీ చర్చిలు, ఆర్‌సీఎం చర్చి, సెవెన్త్‌డే చర్చి, హోసన్నా మినిస్ట్రీస్ చర్చిలు, బైబిల్ మిషన్ వంటి చర్చిలతో పాటు ఇండిపెండెంట్ చర్చిలు కూడా వేడుకలకు సిద్ధమయ్యాయి. నిర్వాహకులు చర్చిలను అందంగా అలంకరించడంతో పాటు విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. అలాగే చర్చిల వద్ద క్రీస్తు జనానికి సాదృశ్యంగా భావించే పెద్ద పెద్ద స్టార్‌లను ఏర్పాటు చేశారు. అలాగే కొన్ని చర్చిల వద్ద క్రిస్మస్ తాతా (శాంటాక్లాజ్) చిత్రపటాన్ని ఏర్పాటు చేసి వాటిని అందంగా తీర్చిదిద్దారు. అలాగే క్రిస్మస్ ట్రీలను ఏర్పాటు చేసి వాటికి విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. చర్చి ఆవరణలో క్రీస్తు జన్మించిన పశువుల పాక నమోనాలను ఏర్పాటు చేసి వాటిని అందంగా తీర్చిదిద్దారు. రాత్రి వేళల్లో ఇవి ప్రకాశవంతంగా కనిపిస్తున్నాయి.

తెల్లవారుజాము నుంచి ప్రార్థనలు

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

తెనాలిరూరల్: మాస్ వ్యవస్థాపక అధ్యక్షుడు సుద్ధపల్లి నాగరాజు ఆధ్వర్యంలో తెనాలి బస్టాండ్ వద్ద 22వ ఐక్య గ్రాండ్ సెమీ క్రిస్మస్ వేడుకలు సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్మన్ కత్తెర హెనీ క్రిస్టినా, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు, హార్వెస్ట్ ఇండియా అధినేత డాక్టర్ కత్తెర సురేష్ కుమార్, బిషప్ పినపాటి జాన్‌పాల్, బిషప్ జె. ప్రభుదాస్, రెవ ఎ. భానుప్రసాద్, మాల మహానాడు నాయకుడు జ్యోతుల బాబి, రాజేంద్రప్రసాద్, సువార్త రావు, డాక్టర్ డేవిడ్ యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

అంగలకుదురులో..

అంగలకుదురులోని ముక్తి స్కూల్‌లో సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఐఎందే తెనాలి ఉపాధ్యక్షురాలు డాక్టర్ పావని, రెడ్‌క్రాస్ సంస్థ తెనాలి కార్యదర్శి ముమ్మనేని భానుమతి పాల్గొన్నారు. స్కూల్ ఉపాధ్యాయులకు చీరలు పంపిణీ చేశారు.

తెనాలిఅర్బన్: సెమిక్రిస్మస్ వేడుకలను ఐతానగర్‌లోని రక్షణ సైన్యం ప్రార్థన మందిరంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా లెఫ్టినెంట్ కల్నల్ జి.థామస్, జి.సీయోను కుమారిలు పాల్గొని క్రిస్మస్ సందేశాన్ని అందించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో సంఘ కాపరి మేజర్ పి.నాగరాజు, రత్నసుందరి, సభ్యులు పాల్గొన్నారు.. అలాగే ట్రూ లివింగ్ హోప్ చారిటీ సంస్థ ఆధ్వర్యంలో యడ్లలింగయ్య కాలనీలో మంగళవారం సెమిక్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా 32వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ మట్లపూడి సంధ్యారాణి, నాయకులు మట్లపూడి రాజేశ్వరరావులు పాల్గొని క్రిస్మస్ సందేశాన్ని అందించారు. అనంతరం పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు గురిందపల్లి పవన్‌కుమార్, గురిందపల్లి బుల్లెబ్బాయి, అమర్తలూరి రత్నప్రకాష్, నవీన్, జయరావు, తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ నెల ప్రారంభమైన నవంబర్ 25 నుంచి పట్టణంలోని అన్ని చర్చిలలో తెల్లవారుజామున ప్రత్యేక ప్రార్థనలు జరుపుతూ వచ్చారు. సంఘ సభ్యులు కూడా తెల్లవారుజామునే చర్చిలకు వచ్చి క్రీస్తును ఆరాధించారు. బుధవారం క్రిస్మస్ పర్వదినం కావడంతో తెల్లవారుజాము నుంచే ప్రార్థనలు జరిపేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. కొన్ని దేవాలయాల వద్ద ప్రేమవిందులు, బహుమతుల పంపిణీ వంటి కార్యక్రమాలను నిర్వహించనున్నారు.



ప్రకాశవంతంగా వెలుగొందుతున్న టౌన్ చర్చి



విద్యుత్‌కాంతులతో సాల్వేషన్ ఆర్మీ చర్చి



సుందరంగా తీర్చిదిద్దిన ఐతానగర్ బాప్టిస్ట్ చర్చి

హైందవ శంఖారావం సభకు తరలి రావాలి



మాట్లాడుతున్న శైవ క్షేత్ర పీఠాధిపతి శివస్వామిజీ

చెరుకుపల్లి: హిందూ దేవాలయాల రక్షణకు, హిందువుల ఐక్యతను తెలియజేసేందుకు జరగనున్న హైందవ శంఖారావం సభకు హిదువులు అధిక సంఖ్యలో హాజరు కావాలని విజయవాడ శైవ క్షేత్ర పీఠాధిపతి శివస్వామీజి పిలుపునిచ్చారు. జనవరి 5న విజయవాడలో సభ విజయవంతం కావాలని నిర్వహిస్తున్న ప్రచార కార్యక్రమంలో భాగంగా మంగళవారం రాజవోలు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. కుల, వర్గ, రాజకీయాలకు అతీతంగా హిందూ సమాజం ఏకతాటి పైకి వచ్చి హిందూ దేవాలయాలను పరిరక్షించాలని శివస్వామీజి కోరారు. సమరత సేవ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

భట్టిప్రోలు: దేవాలయాల పరిరక్షణ కోసం జనవరి 5న విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో జరుగుతున్న హైందవ శంఖారావం సభను జయప్రదం చేయాలని శైవ క్షేత్ర పీఠాధిప శివ స్వామి పిలుపునిచ్చారు. తన పర్యటనలో భాగంగా మంగళవారం ఆయన భట్టిప్రోలు విచ్చేశారు. స్థానిక రథం సెంటర్‌లోని సాయి కృష్ణ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమరసత సేవా ఫౌండేషన్ నిర్వాహకులు జంజనం హేమశంకరరావు, వేల్పూరి శ్రీనివాసరావు, చింతల మురళీకృష్ణ, బూర్లె అరుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

మహ్మద్ రఫీ శత జయంతి వేడుకలు



మహ్మద్ రఫీ చిత్రపటానికి అంబేడ్కర్ యూత్ నిర్వాహకుల నివాళి

అమృతలూరు(భట్టిప్రోలు): ప్రముఖ సినీ గాయకుడు మహ్మద్ రఫీ శత జయంతిని అమృతలూరులో మంగళవారం ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో మహ్మద్ రఫీ చిత్రపటానికి నివాళులర్పించారు. సినీ రంగంలో ప్రముఖ గాయకుడిగా ఆయన చేసిన సేవలను పలువురు వక్తలు కొనియాడారు. హిందీ సినీ వినీలాకాశంలో అతి పెద్ద తారగా విలసిల్లి సంగీతాభిమానులందరికీ చిర పరిచితుడైన రఫీ హిందీ, ఉర్దూ, మరాఠీ, తెలుగు భాషలలో అనేక పాటలు పాడారని గుర్తు చేసుకున్నారు. స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కంభం గిరి, కొడమూరి కృష్ణమూర్తి, షేక్ కరిముల్లా, రెడ్డి, కొల్లిపర సుబ్బారావు, వీరగంధం సాంబశివరావు, యలవర్తి సుబ్బారావు, గర్రెపూడి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.